www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 23 | జూలై | 2024
పేజీలు 8

## ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలి



ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

6 లో

# ఉగ్ర గోదారి..!




- భద్రాచలం వద్ద 49 అడుగులు దాటిన వరద
- 55 అడుగులకు చేరుకునే అవకాశం
- లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు
- పునరావాస కేంద్రాలు సిద్ధం
- తాలిపేరు నుండి భారీగా నీటి విడుదల
- పరిస్థితిని సమీక్షించిన మంత్రి పొంగులేటి
- పొంచి ఉన్న ప్రమాదం

## రెండో ప్రమాద హెచ్చరిక జారీ

గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. సోమవారం రాత్రి కడపటి వార్తలు అందే నాటికి భద్రాచలం వద్ద గోదావరి వరద 49 అడుగులకు చేరుకుంది. నది 48 అడుగులను దాటి ప్రవహించడంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గడిచిన ఆరు రోజులుగా ఎడ తెరిపిలేని వానలు పడుతుండటంతో ఉపనదులతో పాటు వాగులు, వంకలు పొంగుతున్నాయి, తాలిపేరు నీరు గోదావరిలో కలవడంతో వరద తాకిడి మరింత పెరిగింది. క్రమేపి పెరిగి 55 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం తెలిపింది. లక్ష్మీ బ్యారేజీ, ఏటూరునాగారం, పేరూరు వద్ద గోదావరి పెరుగుతోంది.

-ప్రజాపక్షం/భద్రాచలం

2 లో

## రుణమాఫీపై
# రైతుల్లో ఆందోళన



- అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- పునః పరిశీలన చేస్తామని అభయమిస్తున్న అధికారులు

ప్రజాపక్షం/ ఖమ్మం : లక్ష లోపు రుణాల మాఫీపై రైతుల నుంచి ఆవేదన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం చెప్పినట్లుగా రుణమాఫీ జరగలేదన్న ఆవేదన రైతుల నుంచి వ్యక్తమవుతుంది. ప్రభుత్వం చెప్పిన దాని ప్రకారం చూస్తే 50 శాతం మందికి కూడా రుణమాఫీ అమలు కాలేదని సమాచారం. మొదటి దఫాలో ఒక ఖమ్మంజిల్లాలోనే 52వేల మందికి పైగా రైతులకు లక్ష లోపు రుణాలు మాఫీ కావాల్సి ఉంది.ఏ ఇతర బ్యాంకుల్లోను రుణాలు లేకుండా ఒకే బ్యాంకులో లక్ష లోపు రుణమున్నప్పటికీ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులు మాత్రం తాము మాఫీ జాబితాను ఇచ్చామని కానీ ఎందుకు రాలేదో మాకు తెలియదంటూ సమాధానం ఇస్తున్నారు. కొన్ని చోట్ల సహకార సంఘాల సిఈవోలు, బ్యాంకు అధికారులు ఉన్నతాధికారులకు

మిగతా 2లో..

## పెద్దవాగు నిర్వాసితులను
# ఆదుకుంటాం : పొంగులేటి



- రైతులకు పరిహారం ఇస్తాం
- ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 8 కోట్లు కేటాయింపు
- పెద్దవాగు ప్రాజెక్టు గండిని పరిశీలించిన మంత్రి పొంగులేటి
- పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం

ప్రజాపక్షం/అశ్వారావుపేట : పెద్దవాగు నిర్వాసితులందరిని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ గృహాలు కట్టిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ఉప్పొంగి గుమ్మడివల్లి గ్రామం వద్ద పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి కట్ట తెగిన ప్రాంతాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోమవారం పరిశీలించారు.

మిగతా 2లో..

# ఉగ్ర గోదారి..!

**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. సోమవారం రాత్రి కడపటి వార్తలు అందే నాటికి భద్రాచలం వద్ద గోదావరి వరద 49 అడుగులకు చేరుకుంది. నది 48 అడుగులను దాటి ప్రవహించడంతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గడిచిన ఆరు రోజులుగా ఎడ తెరిపిలేని వానలు పడుతుండటంతో ఉపనదులతో పాటు వాగులు, వంకలు పొగుతున్నాయి, తాలిపేరు నీరు గోదావరిలో కలవడంతో వరద తాకిడి మరితం పెరిగింది. క్రమేపి పెరిగి 55 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం తెలిపింది. లక్ష్మీ బ్యారేజీ, ఎటూరునాగారం, పేరూరు వద్ద గోదావరి పెరుగుతోంది. భద్రాచలం వద్ద 53 అడుగులు దాటితే మూడో ప్రమాదహెచ్చరికను జారి చేస్తారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఐటిడిఏ పిఓ నేతృత్వంలో అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేశారు. ఉద్యోగుల సెవులను రద్దు చేసి కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహించాలని సెక్టోరియల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిస్‌లలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఆ నీరు బయటకు రాకుండా ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. కాగా వస్తున్న కొద్దిపాటి నీటిని కూడా భారీ మోటార్ల సహాయంతో ఎత్తి గోదాట్లోకి పోస్తున్నారు. కరకట్ట ప్రాంతంలో సందర్శకుల తాకిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సెల్ఫీలు తీసుకునే వారిని కనిపెట్టి అక్కడి నుండి పంపిచేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పోలీస్ బందో బస్తు నిర్వహిస్తున్నారు.

**తాలిపేరు...**

ఛత్తీస్‌గఢ్‌లో పడుతున్న వానలకు క్రిందనున్న తాలిపేరు ప్రాజెక్టులోనికి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరుతోంది. దాంతో డ్యాం నీటి సామర్ధ్యానికి మంచినీరు వచ్చి చేరే అవకాశం ఉండటంతో 25 గేట్లు ఎత్తిన అధికారులు 46,612 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుద చేస్తున్నారు. కాగా 45,445 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఇదిలా ఉండగా మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా ఇంద్రావతి, ప్రాణహిత ఉపనదులు పెద్దఎత్తున నదిలో కలుస్తున్నాయి, గోదావరి దిగువన ఏపిలో ఉన్న శబరి నది ఉధృతంగా ప్రవహిస్తూ గోదావరికి ఎగపోటు తన్నుతోంది.



**పరిస్థితిని సమీక్షించిన పొంగులేటి...**

గోదావరి వరదల ఉధృతంగా పెరుగుతుండటంతో పరివాక ప్రాంతాల్లో మంత్రి పొంగులేటి సోమవారం పర్యటించారు. ముందుగా అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టుకు గండి పటడంతో ఇబ్బందుల పాలైన ప్రజలను, నిర్వాసితులను కలుసుకుని ధైర్యం చెప్పారు. మరో ప్రక్క పినిపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో పర్యటించి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. వరద పరిస్థితిపై అధికారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వరదల పట్ల ప్రజలు అధైర్యపడవద్దని అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో వరద పరిస్థితి పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అంతా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితులను ఎదురైనా ఎదుర్కనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వరద శరణార్ధులతో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.



**పొంచి ఉన్న ప్రమాదం...**

గోదావరి పరివాహక ప్రాంతానికి ప్రతీ ఏటా ప్రమాదం పొంచి ఉంటోంది. ఇప్పటికే రెండో ప్రమాదహెచ్చరిక దాటి నది ప్రవహిస్తోంది. 55 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా గోదావరి 48 అడుగులు దాటిన నాటి నుండి తీవ్రత మొదలువుతుంది. వరద పెరిగే కొద్ది దుమ్ముగూడెం మండలంతో పాటు భద్రాచలం పట్టణానికి ముంపు పొంచి ఉంటుంది. స్లూయిస్‌ల నుండి వచ్చే బ్యాక్ వాటర్ కారణంగా రామాలయ పరిసర ప్రాంతాల్లోకి సైతం వరద నీరు చేరుకుంటుంది. 48 నుండి 53 అడుగుల మధ్య వరద వల్ల చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని 13 గ్రామాలతో పాటు భద్రాచలం ప్రభావితమవుతాయి. 5358 అడుగుల మధ్య వరద వస్తే చర్ల,దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు,పినపాక మండలాల్లోని 48 నుండి 50 గ్రామాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉంది. 59 68 అడుగుల మధ్య గోదావరికి వరద వస్తే పై మండలాల్లోని 85 గ్రామాలకు ప్రమాదంలో పడతాయి. 73 అడుగుల స్థాయికి వరద చేరితే భద్రాచలంతో పాటు సుమారు 109 నుండి 119 గ్రామాలు ముంపుకు గరవుతాయి. వాటిలో చర్ల మండలంలో 28 గ్రామాలు దుమ్ముగూడెం మండలంలో 53 ద్మామాసు. బూర్గంపాడు మండలంలో 6 గ్రామాలు, అశ్వాపురం మండలంలో 12 గ్రామాలు, మణుగూరు మండలంలో 8 గ్రామాలు, పినపాక మండలంలో 12 గ్రామాలకు వరద గండం ఉంటుంది. 2002 సం.లో గోదావరి వరద 71 అడుగులు దాటి ప్రవహించిన సంగతి విధితమే. దీంతో పరివాహక ప్రజలు ప్రమత్తం ఉండాల్సిన అవసరం ఉంది.

# పెద్దవాగు నిర్వాసితులను ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, స్థానిక ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ తో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వంసమైన ప్రాజెక్టు ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రాజెక్టుకు ఇంతటి గండి పడటం చాలా బాధాకరమన్నారు. స్థానిక అధికారుల ద్వారా మంత్రి పొంగులేటి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కోయరంగాపురం, గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాలలో 51 మంది వరద ముంపు నిర్వాసితుల ఇండ్లకు మంత్రి పొంగులేటి స్వయంగా వెళ్లి పిఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కొత్తూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన శివ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ముంపు ప్రాంతాల్లోని నిర్వాసితులను కలిసి ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారిలో మనో ధైర్యం నింపారు.

**ఎకరానికి రూ. 10వేల సాయం...**

కోయరంగాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. నష్టం జరిగిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. 400 ఎకరాలు ఇసుక మేటతో పూడుకుపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని ఎకరాకు రూ. 10వేల చొప్పున తొలగింపు కోసం ఇస్తామని మంత్రి ప్రకటించారు. పత్తి, వరి పంటలు నష్టపోయిన రైతులకు విత్తనాలు ఉచితంగా ఇస్తామని తెలిపారు. వరదలో కొట్టుకుపోయిన ఒక్కో గొర్రె యజమానికి రూ. 3వేలు, ఆవులు, గేదెలకు సంబంధించి యజమానికి రూ. 20వేలను ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. వరదల వల్ల నీట మునిగి ఇండ్లు కోల్పోయిన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టు మూడు గేట్లతో 40వేల క్యూసెక్యుల వరద విడుదల అవుతుందని 70వేల క్యూసెక్యులు వచ్చినప్పుడు అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్టుకు గండిపడిందని మంత్రి పొంగులేటి తెలిపారు. సరైన సమయానికి గేట్లు ఎత్తి ఉంటే ఇంతటి ముప్పు జరిగేది కాదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రాజెక్టు తక్షణ మరమ్మతుల కోసం రూ. 8 కోట్లు మంజూరు చేయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. పెద్దవాగు ప్రాజెక్టు భూములను కొందరు కబ్జా చేశారని స్థానికులు ఆరోపించగా మంత్రి పొంగులేటి వెంటనే స్పందించారు. వర్షాలు తగ్గాక పూర్తి స్థాయిలో సర్వే చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

**ఆంధ్రా ప్రభుత్వానికి మంత్రి పొంగులేటి కృతజ్ఞతలు...**

41 మంది రైతు కూలీలను రక్షించేందుకు వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడామని పొంగులేటి తెలిపారు. హెలికాప్టర్ సాయంతో వారిని కాపాడరని ఈ సందర్బంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున మంత్రి పొంగులేటి కృతజ్ఞతలు తెలిపారు.

# రుణమాఫీపై రైతుల్లో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

పంపించినా రుణమాఫీ జాబితాను రైతులకు చూపుతున్నారు. రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎట్టి పరిస్థితుల్లో లక్ష లోపు రుణాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ రైతుల్లో మాత్రం సంతృప్తి వ్యక్తం కావడం లేదు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌కు పెద్ద సంఖ్యలో రైతులు తమ బ్యాంకు పాసుపుస్తకాలు, భూ పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని వచ్చి ఫిర్యాదు చేశారు. తమకు రుణమెందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని కంటే ముందు బ్యాంకుల వారీగా ఏ రైతుకు ఎంత అప్పు ఉందో మొత్తం అన్ని బ్యాంకుల్లో కలిపి ఎంత అప్పు ఉందో తెలిస్తే రుణాల మాఫీ విషయంలో పూర్తి స్పష్టత వస్తుందన్న భావన వ్యక్తమవుతుంది. సహకార సంఘాలు, ఇతర వాణిజ్య బ్యాంకులు రైతులకు ఇచ్చిన రుణాలకు సంబంధించి స్పష్టతతో ఉన్న ఎందుకు ఈ గందర గోళం నెలకొన్నదో అర్థం కావడం లేదని రైతులు అంటున్నారు. బ్యాంకులు పట్టాదారు పాసుపుస్తకాలను తమ వద్ద ఉంచుకుని అప్పులు ఇచ్చాయని ఇప్పుడు అప్పుల విషయంలో మాఫీ ఎందుకు వర్తించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. లక్ష లోపు రుణాల మాఫీయే ఇంత గందర గోళంగా ఉంటే మరో రెండు దశల రుణమాఫీ స్పష్టత ఎలా ఉంటుందని రైతులకు ఏ మేరకు న్యాయం జరుగుతుందన్న ఆవేదన కూడా రైతుల నుంచి వ్యక్తమవుతుంది. ప్రభుత్వం మొత్తం రుణ వివరాలు తెలుసుకుని పకడ్బందీగా లక్ష లోపు రుణాలను మాఫీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విజ్ఞానం పెంచేలా బోధనలు



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో విజ్ఞానం పెంచేలా బోధనలు నిర్వహిస్తున్నట్లు మంద్రాజుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.గురవయ్య పేర్కొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తైయిన సందర్భంగా మండలంలోని మంద్రాజుపల్లి లో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....జాతీయ విద్యా విధానం లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలు ను విజయవంతం చేయాలని కోరారు. వివిధ రకాల ఆటల ఆడించటంతో పాటు విజ్ఞానాన్ని పెంచేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలను పెంచాలి

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రభుత్వ హస్పిటల్‌లో ప్రసవాల సంఖ్య ను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.మాలతీ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ ను సోమవారం స్థానిక ప్రభుత్వ హస్పిటల్ ను ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డుల ను పరిశీలించారు. హస్పిటల్ లో ఆవరణ కలియతిరిగారు. పారిశుద్ధ్యం పై అప్రమతంగా ఉండాలని ఆదేశించారు. చెత్త వ్యర్ధాలను ఎప్పటికప్పుడు తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది కి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. హస్పిటల్ కు వచ్చే వారికి అవసరమైన వారికి రక్త పరీక్షలు చేయాలని సూచించారు. 30 ఏళ్ల పై బడిన వారికి బీపీ, షుగర్ కు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ముందులు ఇవ్వాలని ఆదేశించారు. వర్షాకాలం కనుక



సిబ్బంది గ్రామాలలో పర్యటించాలని అన్నారు. ప్రమాదకర పరిస్థితులు ఉంటే స్థానిక వైద్యాధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలి

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. స్వీకరించిన అర్జీలను పరిష్కారం, తిరస్కరణకు గురైతే దానికి గల కారణాన్ని అర్జీదారులకు తెలపాలన్నారు. ప్రజల నుండి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేసి ఆదేశాలు జారీ చేశారు. కూసుమంచి మండలం జీళ్ల చెరువు గ్రామానికి చెందిన అంబాల నర్సయ్య గ్రామంలో ఇండ్ల స్థలాలకు తాను భూమి ఇచ్చినట్లు తనకు మూడు ప్లాట్లు కేటాయించి పట్టా ఇవ్వాలని దరఖాస్తులో కోరారు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన పొట్టపింజర మాధవి తన ఇల్లు ఈనెల 16న వర్షాలకు కూలిపోయిందని తనకు సాయం చేయాలని కోరారు. ఏన్కూరు మండలం నాచారంకు చెందిన కాట్రగడ్డ లలిత తన రేషన్ కార్డు రిజక్ట్ అయిందని తనకు రేషన్ కార్డు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురంకు చెందిన శనిగవరపు శ్రీనివాస్ తాను ప్రజాపాలన క్రింద గృహజ్యోతికి దరఖాస్తు చేసినట్లు తనకు ఉచిత విద్యుత్ వచ్చేలా చూడాలని దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం అమ్మపాలెంకు చెందిన ఉసికల చిన్నరాములు తనకు దళితబంధు మంజూరు రెండవ విడత మొత్తం ఇప్పించాలని దరఖాస్తులో కోరారు. పి. చంద్రకళ జూనియర్ లెక్చరర్ అయిన తాను మధిర నుండి ఖమ్మంకు బదిలీ అయినట్లు తన పిల్లలకు కేంద్రీయ విద్యాలయంలో సీట్లు ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. సింగరేణి మండలం కారేపల్లి గ్రామానికి చెందిన పి. మహేష్ తాను దివ్యాంగుడినని చేయూత పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. చింతకాని మండలం నాగులవంచకు చెందిన నెల్లూరి ఇంద్ర తన భర్త 2014లో చనిపోయాడని తనకు చేయూత పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన బోడాబాబు సర్వే నెం. 39లో 12 కుంటల భూమి తన అనుమతి లేకుండా భూక్యా మాదా పేరుపై వచ్చిందని అట్టి పాపుపుస్తకాన్ని రద్దు చేసి తన పేరున ఇవ్వాలని దరఖాస్తులో కోరారు. ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం గ్రామానికి చెందిన టీచర్స్ కాలనీ వాసులు సర్వే నెం. 165/అ, 166/ఆ నందు అనుమతి, సెట్ బ్యాక్ లేకుండా జీప్లస్ ఫోర్ నిర్మాణం జరుగుతుందని దానిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం పుట్టకోటకు చెందిన చిన్నంశెట్టి రామారావు తాను దివ్యాంగుడి (మరుగుజ్జు)నని తాను ఏ పని చేయలేనని ఉపాధి కల్పించాలని కోరారు. తల్లాడ మండలం మల్సూరు తండాకు చెందిన భూక్యా రాజగోపాల్ తనకు మీ సేవ కేంద్రం మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం శ్రీనివాసనగర్‌కు చెందిన యు. దేవి తనకు జీవో నెం. 58 ద్వారా ఇంటి స్థలం ఇచ్చారని అట్టి స్థలంలో ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని కోరారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన కె. సుభద్ర తనకు ప్రభుత్వం 1.14 ఎకరాల భూమి ఇచ్చిందని అట్టి భూమి తన స్వాధీనంలోనే ఉందని పట్టాపాసు పుస్తకం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించిన కలెక్టర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డిఆర్డివో సన్యాసయ్య, జెడ్పిసిఈవో ఎస్. వినోద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఫ్రూట్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఖమ్మం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షులుగా గగర శ్రీనివాస్, అధ్యక్షులు ఎస్‌కె జానిమియా, ప్రధాన కార్యదర్శి ఏటుకూరు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎండి ఉస్మాన్ అలీ, గౌరవ సలహాదారులుగా ఎ. మల్లికార్జున్, కమిటీ సభ్యులుగా ఎస్‌కె కరీం, ఎస్‌కె ఖాసీంలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మంలో వ్యవసాయ ఉత్పత్తులైన అరటి, మామిడి, జామ, సపోట, బొప్పాయి, దానిమ్మ మొదలగు దిగుబడులు ఖమ్మం నగరంలో మార్కెట్ సదుపాయం లేకపోవడం వలన ఖమ్మంకు తక్కువ దూరంలో ఆంధ్రా ప్రాంతమైన విజయవాడ మార్కెట్‌కు తరలి వెళ్తున్నాయని అందులో కొంత మంది చిన్నకారు రైతులు పండించిన వాటిని ఖమ్మం మార్కెట్‌కు తీసుకు వస్తున్నా దుకాణాలన్నీ ఖమ్మం కార్పోరేషన్ ముఖ్య కూడళ్లలో ఉండడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొని వారు కూడా మార్కెట్‌కు రావడానికి భయపడి వేరు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారని ఖమ్మంలో మార్కెట్ సదుపాయం ఏర్పడితే ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ఖరీదుదారులు వస్తారన్నారు. అందువల్ల రైతులకు కూడా రవాణా ఛార్జీలు తగ్గి వారి పంటలకు మంచి ధర వస్తుందన్నారు. సెస్ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని ఖమ్మం నగరంలో పండ్ల వ్యాపారమే జీవన వృత్తిగా మలుచుకుని జీవనోపాధి పొందుతున్న 10వేల మంది జీవితాలు మెరుగుపడతాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పండ్ల మార్కెట్ సౌలభ్యం ఉంది కానీ మన ఖమ్మంజిల్లాలో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోల్‌సేల్ ఫ్రూట్ మర్చంట్, వెల్ఫేర్ యూనియన్లు ఖమ్మంలో 2011వ సంవత్సరంలో ప్రారంభించారన్నారు. అప్పటి నుండి పండ్ల వ్యాపారాలపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. అప్పటి నుండి మార్కెట్ కొరకు ప్రయత్నిస్తున్నామన్నారు. మార్కెట్ విషయమై గతంలో అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించామని దానికి వారు సానుకూలంగా స్పందించినప్పటికీ అప్పట్లో ఉన్న వివిధ కారణాల రీత్యా మార్కెట్ నిర్మాణం జరగలేదన్నారు. గత ప్రభుత్వం బుర్హాన్‌పురంలోని పాత డిఆర్డిఏ కార్యాలయం వెనుక కేటాయించిన ఎకరం స్థలం మార్కెట్ ఏర్పాటుకు సరిపోవడం లేదని అక్కడ ఉన్న మొత్తం స్థలాన్ని కేటాయించినట్లయితే పండ్ల మార్కెట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఖానాపురం సర్వే నెం.321లో గల ఆగ్రో ఇండస్ట్రీ వారి గమాక్టిన్ ఫ్యాక్టరీకి చెందిన స్థలం నందు పండ్ల మార్కెట్ ఏర్పాటుకు లేదా కొత్త బస్టాండ్ పక్కన సర్వే నెం.90లో గల స్థలంలో ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సహకరించాలని వారు కోరారు.

# హోంగార్డును సన్మానించిన పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు సిహెచ్ నాగేశ్వరరావును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో సిపి సునీల్ దత్ హోంగార్డు నాగేశ్వరరావు దంపతులను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం వివిధ విభాగాలలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలను అందించి అధికారుల మన్ననలు పొందారని సిపి తెలిపారు. రిటైర్‌మెంట్ తన వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సిపి తెలిపారు. నాగేశ్వరరావు విధి నిర్వహణలో తోడ్పాటునందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కామరాజు, హోంగార్డ్ ఆర్‌ఐ సురేష్, హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం బాధ్యులు బంక శ్రీను, నీరజ, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 34 వినతులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 34 వినతులు వచ్చినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించని ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వినతుల్లో ఎక్కువగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, జనన మరణాలు, శానిటేషన్ పై వినతులు వచ్చాయి. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా ఉస్మాన్ షరీఫ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఎండి ఉస్మాన్ షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచ్ సిఐగా విధులు నిర్వహిస్తున్న ఎండి ఉస్మాన్ షరీఫ్ రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా బదిలీ పై వచ్చారు. రఘునాథపాలెం ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న టి. శ్రీహరి ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ ఉస్మాన్ షరీఫ్‌కు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# వివిరెడ్డికి స్ఫూర్తి ప్రధాత అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం స్వర సుధ ఉపాధ్యక్షులు, సీనియర్ సింగర్ వివిరెడ్డికి స్ఫూర్తి ప్రధాత అవార్డును ప్రదానం చేశారు. ఆదివారం కరీంనగర్ ఫిల్మ్ భవన్ ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీ గౌతమేశ్వర సహిత కళా సేవా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన సీనియర్ సింగర్ వివిరెడ్డికి స్ఫూర్తి ప్రధాత అవార్డును ప్రదానం చేశారు. సగౌరవంగా స్వర్ణకంకణ ధారణతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ అధ్యక్షులు దూడపాక శ్రీధర్, కార్యదర్శి మణి రాయల్, విశ్వ విఖ్యాత ఆర్ట్ అండ్ కల్చర్ అకాడమీ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ రంగాల ప్రముఖులు, ఖమ్మం స్వర మధురిమ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ పాల్గొన్నారు.

# ప్రతిభ కనబర్చిన అడ్వైజర్స్‌కు స్టార్ రివార్డులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చిన అడ్వైజర్స్‌కు స్టార్ రివార్డులను అందజేశారు. సోమవారం ఖమ్మం యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కార్యాలయం నందు అడ్వైజర్స్ సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి ఏజెంట్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా యూనైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కెవిఆర్ కృష్ణ, యుఎంఈఎక్స్ రీజినల్ మేనేజర్ తిరుపాల్, మేనేజర్ బి. కుర్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ప్రతిభ కనబర్చిన వారికి స్టార్ రివార్డులను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో ఎలా వ్యాపారం చేయాలో, కొత్తగా కంపెనీలోకి వచ్చిన అడ్వైజర్స్‌కు వివరించారు. రివార్డులు, స్కీములు, ఇతర అంశాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజినల్ మేనేజర్ కె. సంధ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని సేవాలాల్ సేన నేతలు తెలిపారు. సోమవారం ఖమ్మంలోని టిటిడిసి భవనంలో సేవాలాల్ సేన ఖమ్మంజిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానం నుంచి టిటిడిసి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథులుగా ఫౌండర్ ప్రెసిడెంట్ భూక్యా సంజీవ్ నాయక్, రైతు సంఘం అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ లు మాట్లాడుతూ మా తండాలో మా రాజ్యం కావాలని , జనాభా దామాషా ప్రకారం గిరిజనులకు అన్ని రంగాలలో వాటా ఇవ్వాలని సేవాలాల్ సేన ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, జీవో నెం.3ను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. తండా ప్రజలపై ఎక్సైజ్ పోలీసుల దాడులను అరికట్టాలని, ఏజెన్సీ ప్రాంతాలలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షునిగా బానోత్ శ్రీకాంత్ నాయక్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సైదా నాయక్, హుస్సేన్ నాయక్, వెంకన్న నాయక్, బాలకృష్ణ, నాగరాజు, బాలు నాయక్, రాజ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న ప్రతిఒక్క రైతుకు రుణమాఫీ ఇవ్వాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని అమలు చేసిన జీవోను సవరించి అర్హులైన ప్రతిఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్న వారికే రుణమాఫీ వర్తిస్తుందని నిబంధనలు పెట్టడం సరైంది కాదన్నారు. జిల్లాలో సుమారు 5లక్షల మందికిపైగా రైతులు ఉంటే 57వేల మందికి రుణమాఫీ వర్తించిందని, సుమారు 3లక్షల మందికి రావాల్సి ఉందన్నారు. దేశ వ్యాప్తంగా రుణమాఫీచేశామని ప్రచారం ఆర్భాటమే తప్పా రైతులకు ఒరిగిందేమి లేదన్నారు. రేషన్‌కార్డుతో ముడి పెట్టకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ శీలం సత్యనారాయణరెడ్డి, సిపిఎం పార్టీ మండల కన్వీనర్, రైతు సంఘం నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, రైతు సంఘం తల్లాడ మండల కన్వీనర్ నల్లమోతు మోహన్‌రావు, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణికి నివాళులర్పించిన తుమ్మలపల్లి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణానికి చెందిన గ్రామ పెద్దలు దగ్గుల అప్పిరెడ్డి కుమార్తె కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. ఆమె దశదిన కర్మ సోమవారం తల్లాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు హక్కుల హరీష్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

## రైతు రుణమాఫీ లబ్ధిదారులు రెన్యూవల్ చేసుకోవాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారులు బ్యాంకుల్లో రెన్యూవల్ చేయించుకోవాలని తల్లాడ ఎపిజివిబి బ్యాంక్ మేనేజర్ వీరన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ లక్షలోపు రుణాలు మాఫీ అయిన రైతులు ఆధార్‌కార్డు, ఫొటోలు, వన్‌బి, పట్టాదార్ పాస్‌పుస్తకం తీసుకుని రావాలని సూచించారు. రెన్యూవల్ చేసుకున్న అనంతరం కొద్దిరోజుల తర్వాత కొత్త రుణాలు కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రైతులందరికీ రుణమాఫీ ఇవ్వాలని నిరసన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని సాగు చేసుకుంటున్న రైతులందరికీ ఎటువంటి షరత్తులు లేకుండా వర్తింపజేయాలని సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయం ఎదురుగా పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తదితరుల చరిత్ర సాగు చేసుకుంటున్న రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని అన్నారు. గానుగపాడు సొసైటీ పరిధిలో 2500 మంది బ్యాంక్‌ల్లో అప్పు తీసుకున్నారని అన్నారు. కానీ 500 మంది రైతులకే రుణమాఫీ అవ్వటం జరిగిందన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా అరకొరగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ఇచ్చి చేతులు దులుపుకుందని వారు విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సొసైటీ ఛైర్మన్ చెవుల చంద్రరావు, సీఈవో లంక నరసరావుకు అందజేశారు. ఈకార్యక్రమంలో రైతులు నరుకుల్ల సత్యనారాయణ, భూపతి రమేష్, పిచ్చయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాగులను పరిశీలించిన సీఐ



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండలంలో గత మూడు రోజుల క్రితం కురుస్తున్న వర్షాల వల్ల సిఐ వెంకటేశ్వరరావు తక్షణమే స్పందించి సోమవారం అక్కడి వాగులు, వంకలను పరిశీలించారు. వరద ముప్పు పెరగడంతో స్థానిక ప్రజల భద్రత కోసం ఆయన అనేక చర్యలు చేపట్టాలని కోరారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించి, తక్షణ సహాయ చర్యలు తీసుకోవాలని సిఐ వెంకటేశ్వరావు స్థానిక అధికారులతో కలిసి వాగులు, వంకల పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలు వలన వర్షాల ప్రభావం తగ్గించి, ప్రజలకు భద్రత కల్పించాలని కోరారు. ఎస్సై రాజ్ కుమార్, ఎస్సై రాజేందర్ డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు అండగా ఉండాలి

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అండగా యువజన కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాచలంలోని వరదల సమీక్షలో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్‌లతో కలిసి బూర్గంపాడు మీదుగా వెళ్తున్న ఆయన మార్గమధ్యమంలో పాత గొమ్మూరు వద్ద ఆగి గోదావరి వరదలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే క్రమంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో జములారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, బూర్గంపాడు టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, ప్రముఖ అడ్వకేట్ భజన సతీష్‌కుమార్, యువజన నాయకులు భజన ప్రసాద్, దాసరి సాంబ, తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల గోదావరి వరదల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమీపంలోని వాగులు, వంకలు పొంగిప్రవహిస్తున్నాయని వాటిని దాటే ప్రయత్నాలు చేయవద్దన్నారు. గోదావరి వరద కూడా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసరమైతే తప్ప ఇంట్లో నుండి బయటకు రావోద్దని సూచించారు. అదే విధంగా గోదావరి వరదను చూసేందుకు గోదావరి సమీప ప్రాంతాలకు వెళ్లవద్దని తెలిపారు. వరద ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలు అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, అధికారులు మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా శుభ్రంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య అధికారులు చికిత్సకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల యువజన విభాగం అధ్యక్షులు గోనెల నాని, మైనార్టీ మండల అధ్యక్షులు సాదిక్ పాషా, పలువురు పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించాలి

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లక్ష్య సాధనకు ఏకాగ్రత, పట్టుదలతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కేంద్రంలో గ్రూప్ 1 ఉద్యోగార్థులకు చేపట్టిన ఉచిత శిక్షణా తరగతుల్లో కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు అనుసరించాల్సిన వ్యూహాన్ని గురించి కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు శ్రమపై దృష్టి పెట్టాలని, ఖచ్చితంగా ఫలితం వస్తుందని తెలిపారు. సిలబస్‌ను అనుసరించాలన్నారు. ఒకరినొకరు సహకరించుకోవాలని, తమకు తెలిసిన విషయాలు ఒకరినొకరు పంచుకోవాలన్నారు. ఇంటిని, చదువును బ్యాలెన్స్ చేసుకోవాలన్నారు. నిరాశ, నిస్పృహలకు గురికావద్దని, ఆశావాహ ధృక్పథంతో ముందుకెళ్లాలన్నారు. పరిస్థితులు లక్ష్య సాధనకు అడ్డంకులు కావని అవకాశాలను విజయాలుగా మల్చుకోవాలన్నారు. చదువుతో పాటు అరగంట ఆటలు, వ్యాయామానికి ఖచ్చితంగా కేటాయించాలన్నారు. మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. సమస్యలకు ఆందోళన చెందకుండా పరిష్కారానికి యోచన చేయాలన్నారు. లక్ష్య సాధనకు వనరులు ఎప్పుడు అడ్డంకి కాదని ఆయన తెలిపారు. వనరులు సృష్టించుకోవాలని, అవకాశాలు విజయానికి మెట్టుగా మల్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఉద్యోగార్థుల సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత తదితరులు ఉన్నారు.

# లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/పినపాక:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు తెలిపారు. సోమవారం పినపాక మండలం పాతరెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని చింతల బయ్యారం గ్రామాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి కొమరం లక్ష్మణరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల గోదావరి వరదల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమీపంలోని వాగులు, వంకలు పొంగిప్రవహిస్తుండటంతో గోదావరి వరద కూడా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసరమైతే తప్పా ఇంట్లో నుండి ఎవరు బయటకి రావద్దని, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని, గోదావరి చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. అలాగే తెలంగాణ రైతు బీమా కొరకు ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫోన్ నంబర్ మార్చుకొనడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమరం సాంబశివరావు, పడిగల తరుణ్, బక్కయ్య, సాయి, సర్వేశ్వరరావు, నీలం, పరమేష్, నర్సిమ్మతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు కుక్కలైనా సరే..

# ఫిర్యాదు చేస్తే ఆరు నెలలు శిక్ష..!



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ఇళ్లలో శునకాలు, పిల్లులు, పావురాలు, కుందేళ్లు ఇలా అనేక రకాల జంతువులు, పక్షులను పెంచుకోవటం చాలా మందికి అలవాటు. వాటిని కొందరు కుటుంబ సభ్యులా చూసుకుంటారు. వాటిని ఏమన్నా తట్టుకోలేరు. పెంపుడు జంతువులే కదా.. అనీ వాటి యజమానులు ఇష్టానుసారంగా వదిలేస్తే ఇక కుదరదు. ఇంటికి వచ్చిన వారి పైకి కొన్ని సార్లు దారిలో వేళ్లే వారి పైన పెంపుడు కుక్కలు పశువులు, దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. పెంపుడు కుక్కలు , పిల్లులు, పక్షులు, పశువులను పెంచుకునే వారు వాటి పట్ల పూర్తి బాధ్యతగా వ్యవహరించాల్సిందే. లేదంటే జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలు బాధితులకు అండగా నిలుస్తుంది.

**ఇరుగు...పొరుగు వారని మొహమాటం వద్దు....**

పెంపుడు శునకాల వలన ఇరుగు, పొరుగు వారు ఇబ్బందులు పడుతుంటారు. శునకం ఉన్న ఇంటికి ఇతరులు ఎవరు వచ్చినా పెద్ద పెద్ద అరుపులతో శబ్ధం చేస్తోంది. దీంతో పక్కనే ఉన్న ఇళ్ల వారికి అసౌకర్యం కలుగుతుంది. రాత్రి పూట పిల్లలు చదువుకోవటానికి ఆటంకం కలుగుతుంది. రోజు పెంపుడు జంతువులను ఉదయం, సాయంత్రం ఇంటి బయటికి తీసుకరావాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఇంటి పక్కన వారి పై దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. చిన్న పిల్లలు భయపడుతుంటారు. రాత్రి వేళ ప్రక్కన ఉన్న ఇళ్ల లో నివాసం ఉండే వారికి నిద్ర భంగం కలుగుతుంది. నేలకొండపల్లి మండలం లోని వివిధ గ్రామాల నుంచి కుక్క కాటు బాధితులు భారీగా ఉన్నారు. ఇందులో వీధి కుక్కల కాటు బాధితులతో పాటు, పెంపుడు కుక్కల శునకాలు ఉన్నారు.

**ఇక చట్టాలు కఠినం....**

కుక్కలు కరిస్తే చట్టాలు కఠినంగా విధించారు. జూలై 1 నుంచి అమలలోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం పెంపుడు జంతువులు ఇతరుల పై దాడి చేసినా, గాయపరిచినా సంబంధిత యజమానులు పై బాధితులు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. యజమానికి దాదాపు ఆరు నెలలు పాటు శిక్ష విధించే అవకాశం ఉంది. గ్రామాలలో పట్టణాలు, వీధి కుక్కలు ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. ప్రజల పై దాడి చేసి గాయపరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరా, నేలకొండపల్లి తదితర పట్టణాలలో కుక్కల బెడద వెంటాడుతుంది. అదే విధంగా పెంపుడు జంతువుల యజమానుల కు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

**పెంపుడు కుక్కలు దాడి చేస్తే యజమానులదే బాధ్యత**

**కొత్త చట్టం గురించి అవగాహన కల్పించాలి : పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి.**



జూలై 1 నుంచి కొత్తగా వచ్చిన చట్టం గురించి గ్రామాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. పెంపుడు జంతువుల గురించి యజమానుల కు కౌన్సిలింగ్ నిర్వహించాలి. తీరు మారకుంటే తప్పకుండా కొత్త చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాల్సిందే.

**వీధి కుక్కల గురించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గండు సతీష్, మాజీ సర్పంచ్, అమ్మగూడెం.**



ప్రజలను ఇబ్బంది పెట్టే వీధి కుక్కల పట్ల ప్రభుత్వ తగిన చర్యలు తీసుకోవాలి. వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలిస్తే బాగుంటుంది. పశు వైద్యశాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వీధి కుక్కల గురించి చర్యలు : యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.**



గ్రామాలలో వీధి కుక్కల సైర్వ విహారం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చింది. వాటి నివారణ పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయం పై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పంచాయతీలలో కార్యదర్శుల తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశాం.

## కార్మిక సంక్షేమంపై పట్టింపులేని కొండాపురం గని యాజమాన్యం

**ప్రజాపక్షం/మణుగూరు:** వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండాపురం భూగర్భ గని ఫిట్ ఆఫీస్ జలమయంతో నిండు కుండను తలపిస్తుందని, అఫీస్ పనుల కోసం వచ్చే కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని ఏరియా టి బి జి కె యస్ బ్రాంచి ఉపాధ్యక్షులు నాగెల్లి తెలిపారు. చిన్న చినుకు పడితేనే అఫీస్ లోకి నీరు వచ్చే విధానం ఎప్పటినుంచో ఉన్నప్పటికీ దాని నియంత్రణకు గని అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వల్ల నేడు వర్షం నీటి లోనే అఫీస్ పనులు నిర్వర్తించే దుస్థితి దాపురించిందని తెలిపారు. ముఖ్యంగా గని పేరిట పని చేస్తున్న వందలాది మంది కార్మికుల విలువైన జీవితాలకు సంబంధించిన వ్యక్తిగత ఫైళ్ళు అన్ని కూడ కొండాపురం ఫిట్ ఆఫీస్ నందునే ఉన్నాయని వాటిని అత్యంత భద్రతగా ఉంచవలసిన భాధ్యత గని అధికారుల పై ఉన్నప్పటికీ వాటి పై పట్టింపు లేనట్టుగా వ్యవహరిస్తూ వర్షానికి కురిసే గదిని ఆఫీసుకు కేటాయించడం దుర్మార్గమైన విధానం అన్నారు. వ్యక్తిగత ఫైళ్ళను భద్రపరిచే అంశంలో వాటి రక్షణ విషయంలో అనేక నియమ నిబంధనలు ఉన్నప్పటికీ కురుస్తున్న గదిని ఆఫీసుకు కేటాయించడం కార్మిక సంక్షేమం పట్ల గని అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని తెలిపారు. అఫీస్ గదిలోకి అనేక మార్గాల ద్వారాల నుంచి వర్షపు నీరు చేరుతుందని దానిని వెంటనే అరికట్టి వ్యక్తిగత కార్మిక ఫైళ్లకు ముప్పు వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వ్యక్తిగత ఫైళ్ళు వర్ష బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఫైళ్ళు భద్ర పరిచేందుకు పటిష్ఠమైన అఫీస్ గదిని కేటాయింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# కలెక్టర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేతలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముజమ్మిల్ ఖాన్‌ను బిఆర్ఎస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం కలెక్టరేట్‌లో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్ రాజు, కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు బొజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పాము కాటుతో వైద్యం పొందేందుకు వెళ్లిన రైతు పట్ల నిర్లక్ష్యం వహించిన ఘటనపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ దృష్టికి వచ్చిన వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు బిఆర్ఎస్ నేతలు వివరించారు.

## విద్యారంగానికి నిధులు కేటాయించాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** విద్యారంగానికి నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే షాహిద్ అన్నారు. సోమవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు సంక్షేమ వసతి గృహాలను, కేజీబీవిలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ఈ ఏడాది బడ్జెట్లో కేంద్రం 10శాతం, రాష్ట్రం 30శాతం నిధులు కేటాయించాలని, తద్వారా దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పరిరక్షణకు, ప్రభుత్వ విద్యా బలోపేతం చేసే విధంగా నిధుల కేటాయింపులు ఉండాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో గాని విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నటువంటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్య హక్కులను సాధించుకునే విధంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుండాల మండల కార్యదర్శి గంగాధరి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మండలంలో గత ఆరు రోజులుగా ఎడతెరిప లేకుండా కురుస్తున్న వర్షాలు సోమవారం కాస్త తగ్గుముఖం పట్టడంతో మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలో రహదారులపై ఉన్న నీటిని, సైడ్ కాలవలో ఉన్న నీటిని పోయే విధంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమాలను ఇన్‌చార్జ్ ఎంపిడివో, మండల పంచాయితీ అధికారి బత్తిన శ్రీనివాసరావు రాయపాడు, అనంతోగు, పాతూరు, రాఘవపురం, మర్కోడు గ్రామ పంచాయితీలను సందర్శించారు. అక్కడ జరుగుతున్నటువంటి కార్యక్రమాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీపీ కోండ్రు మంజుభార్గవి, ఇన్‌చార్జ్ ఎంపిడివో బత్తిన శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యాధికారి రేవంత్‌లు ఆయిల్ బాల్స్ వేసి, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు నాగరాజు, రమేష్, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమారి, త్రివేణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, నరేష్ పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురైన కారు



**ప్రజాపక్షం/మణుగూరు:** పీకే ఓసి 2 ఎస్ అండ్ డి లో పనిచేస్తున్న పి రామ్మోహన్ దంపతులు సి టైప్ ముత్యాలమ్మ నగర్ వద్ద సోమవారం వారు నడుపుతున్న కారు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వచ్చి ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న గుర్తింపు సంఘం ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్ వెంటనే స్పందించి క్షతగాత్రులను ఏరియా హాస్పిటల్ కి తరలించి పరిస్థితిని సమీక్షించి మెరుగైన వైద్యం కొరకు డాక్టర్లను సంప్రదించి కొత్తగూడెం పంపించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్‌తో పాటు సుదీప్, ఆదిత్య ఉన్నారు.

## మాజీ జెడ్‌పిటిసిని పరామర్శించిన జెడ్‌పిటిసి శ్రీలత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి భూపల్లి నరసింహారావు ఇటీవల కొన్ని రోజుల క్రితం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కంటి చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాగ సోమవారం జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత ఆయనను పరామర్శించారు. ఈసందర్భంగా యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో బూర్గంపాడు మండల యువజన విభాగం అధ్యక్షులు గోనెల నాని, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సాదిక్ పాషా, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరద ముంపును నివారించాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** భారీ వర్షాలతో బేంబేలెత్తుతున్న మణుగూరు ప్రజలకు ప్రభుత్వం బాసటగా నిలవాలని, వరద ముంపును నివారించాలనీ కోరుతూ సోమవారం జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందనకి మణుగూరు సామాజిక సేవకులు వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలు అంటేనే మణుగూరు ప్రజల గుండెజారి గల్లంతవుతోందని రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఎడతెరిపి కురుస్తున్న కుండపోత వర్షాలకు మణుగూరు తో పాటు పినపాక నియోజకవర్గం కూడా అతలాకుతలం అవుతోందని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మణుగూరుకు వరద ముంపును నివారించాలని ప్రజలకు భరోసా ఇవ్వాలని రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని బాబురావు కోరినట్లు తెలిపారు. సంవత్సరం ఎంతో ఓపికగా విని పరిష్కారానికి క్రింది అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పట్ల అదనపు కలెక్టర్ విద్యా చందనకి కర్నే బాబురావు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలి

**ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలను అందించి ప్రజల్లో నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఫార్మసీ, వార్డులను పరిశీలించారు. రోగుల సహాయకులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. రోజు వచ్చే రోగుల వివరాలు, ఏ బాధలతో ఎక్కువగా వస్తున్నది అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మందుల అందుబాటును అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ వద్ద గుంపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎన్ని రకాల వ్యాక్సిన్స్ ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ యూనిట్ సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. రోజుకు ఎన్ని ప్రసవాలు చేస్తున్నది, ఇడిడి రిజిస్టర్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాల గురించి అవగాహన కల్పించాలని, గర్భిణీలకు ముందస్తుగా సాధారణ ప్రసవాలకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు రోగులు, రోగుల సహాయకులతో ఆసుపత్రి సేవల గురించి వివరించి వారికి నమ్మకం కలిగించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి పేద వారు ఎక్కువగా వస్తారని వైద్యులు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలను అందించి వారిని ఆదుకోవాలన్నారు. ఆసుపత్రిలో సమస్యలు, కావాల్సిన సౌకర్యాల గురించి నివేదిక సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి. కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు డాక్టర్ బి. రాంబాబు, డాక్టర్ రాథోడ్ వినాయక్, డాక్టర్ అమర్ సింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వైతాళికుడు దాశరథి కృష్ణమాచార్య



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** నా తెలంగాణ కోటి రత్నాల వీణాను మీటి, కలం బట్టి గళం విప్పిన ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో దాశరథి జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి దాశరథి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. వారి రచనలు ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. యాదగిరి, శ్రీదేవి, పంజాల ఐలయ్య, బి. శ్రీనివాసరావు, డివిఎన్‌రెడ్డి, జయరాజ్, కుద్దూస్, కిస్తూ పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండా పంచాయతీలో సోమవారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా నిర్వహించారు. కార్యదర్శి ఉమా ఆదేశాల మేరకు కార్మికులు కాల్వల పూడికతీత పనులు చేపట్టడంతో పాటు చెత్త చెదారాలను తొలగించారు. అలాగే అపరిశుభ్ర ప్రాంతాలలో దోమల వ్యాప్తి చెందకుండా..దుర్వాసన వెదజల్లకుండా బ్లీచింగ్‌ను చల్లారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ...వర్షాలు కురుస్తున్నందున్న సీజనల్‌వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంటితో పాటు పరిశర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శానిటేషన్,లైటింగ్‌తో పాటు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పనులపై నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయాలని, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్మికులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కారం చేసి, ప్రజలకుఎటువంటిఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

# గురుకుల పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మించాలి



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధి కృష్ణాపురం గ్రామంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలకు సొంతభవనాన్ని నిర్మించాలని ఎంఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఊటుకూరి రత్నాకర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న గురుకుల పాఠశాల భవనంలో విద్యార్థులకు సరిపడినంత వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నార న్నారు. ప్రభుత్వం తక్షణమే గురుకుల పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మించి విద్యార్థులు మెరుగైన వసతి సదుపాయాలను కల్పించాలన్నారు. అదేవిధంగా హాస్టల్స్ బెడ్స్, డైనింగ్ హాల్‌లో బల్లాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, అధ్యాపకులను నియమించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు కూరపాటి ప్రభాకర్‌మాదిగ, ఎంఎస్ఎఫ్ మధిర మండల అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, బొబ్బిళ్ళపాటి రత్నకుమార్, పల్లెకంటి సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సై జుబేదా బేగంను సత్కరించిన మద్దెల



**ప్రజాపక్షం/సుజాతనగర్:** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. సోమవారం సుజాతనగర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న జుబేదా బేగం ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ ఒకనాడు వంటింటి కుందేలుగా వంటింటికే పరిమితమైన మహిళలు ఈనాడు అన్ని రంగాలలో రాణిస్తూ ప్రగతి పథంలో ముందుకెళ్తున్నారన్నారు. ఈ ఆత్మీయ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బలరాం, స్థానిక నాయకుడు లావుడియా సత్యనారాయణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్స్ కే చంద్రశేఖర్, పి వెంకటేశ్వరరావు, ఎస్ వీరభద్రం, ఉప్పలయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ బి.తౌరియా ఆధ్వర్యంలో సోమవారం క్లీన్ అండ్ గ్రీన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలను, చెత్తచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ బి.జైదాస్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి ఐదవ వార్డులోని రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలు దట్టంగా పెరగటంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఐదవ వార్డులోని ఎస్సీ కమిటీ హాల్ నుండి సురేష్ ఇంటి వైపు వెళ్లే రోడ్డు భారీ వర్షాల వలన పిచ్చిమొక్కలు దట్టంగా పెరగటంతో పాటు సిమెంట్ రోడ్డు లేకపోవడం రోడ్డు మొత్తం బురదమయంగా మారడంతో ప్రజలు ఈ దారిలో నడవాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా మున్సిపాల్టీ అధికారులు గాని, వార్డు కౌన్సిలర్ గాని స్పందించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేయించి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# వైరా మున్సిపాలిటీ పారిశుద్ధ్యంపై కమిషనర్ ప్రత్యేక దృష్టి

**-శానిటేషన్ అధికారి అసిస్టెంట్లు తొలగింపు**
**-ఉదయం 5గంటలకు శానిటేషన్ అధికారులు రావాలి**
**-సమస్యలను తెలపండి : కమీషనర్ వేణు**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ శానిటేషన్ అధికారులు మజాకా అనే కథనాన్ని ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి స్పందించిన జిల్లా అధికారులు, వైరా మున్సిపాల్ చైర్మన్, మున్సిపాల్ కమీషనర్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీలోని 20 వార్డులను రెండు సెక్టార్లుగా చేసి 10 వార్డులకు ఒకరు, 10 వార్డులకు ఒకరిని నియమించి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మున్సిపాల్ కమీషనర్ వేణు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శానిటేషన్ అధికారి అసిస్టెంట్లును తొలగించారు. అదేవిధంగా పారిశుద్ధ్యంపై మున్సిపాల్ కమీషనర్ వేణు ప్రజాపక్షంతో మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగిందని, ప్రతిరోజు వార్డులో డ్రైనేజీల శుభ్రం రోడ్ల ప్రక్కన ఉన్న పిచ్చి చెట్లు తొలగింపు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజల ఆరోగ్యం ధ్యేయంగా వైరా మున్సిపాలిటీ సేవలు అందించడం జరుగుతుందని, పారిశుద్ధ్య సమస్య లోపం ఉన్న ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని చెత్త వాహనాలు ఏ ప్రాంతానికి రావటం లేదో ఆ ప్రాంత ప్రజలు నా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా శానిటేషన్ విషయంలో మున్సిపాలిటీ సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం చేసిన సహించేది లేదని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి చేపట్టడం జరిగిందని, విధి నిర్వహణలో ఆలస్యం వహించి విదులకు సక్రమంగా రాకపోయినా చర్యలు తప్పవన్నారు. శానిటేషన్ అధికారులు ఉదయం 5గంటలకు మున్సిపాలిటీ కార్యాలయానికి రావాలి. ప్రతిరోజు చేసే పనులకు సంబంధించిన ఫొటోలు పంపాలి అని అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు నేపద్యంలో అన్ని ప్రాంతాల్లో సేవలు అందించేందుకు మున్సిపాల్ సిబ్బందిని సిద్ధం చేయడం జరిగిందని కమీషనర్ వేణు తెలిపారు.

# విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని సిరిపురం ఉన్నత పాఠశాల నందు గ్రామానికి చెందిన సాదినేని కృష్ణమూర్తి, దేవిక దంపతుల కుమారుడు, కోడలు రాహుల్, వినీసల వితరణతో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్‌ను ఎంఇఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయటం జరిగింది. అదే విధంగా స్కూల్‌కు ఇనుపబీరువా, ఐరన్ రాక్‌లను కూడా అందించటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ దాతల సహకారం వెలకట్టలేనిదని, విద్యార్థులు దాతలు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచిగా చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ మురళీమోహన్, హెచ్ఎం ఎస్కె.బాజ్జీ, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం...

- గత ప్రభుత్వ తప్పిదాలు పునరావృతం కావు
- పునరావాస కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు
- ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం
- మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి వరదల విషయంలో ప్రజలు భయపడొద్దని, ప్రజలకు అన్ని విధాలుగా అండదండగా ఈ ప్రభుత్వం ఉంటుందని రెవెన్యూ, సమాచారశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. గోదావరి వరదలు పెద్ద ఎత్తున వస్తుండటంతో సోమవారం భద్రాచలం చేరుకున్న ఆయన కరకట్టపై కలియ తిరిగారు. ఆ తర్వాత నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. వరద పరిస్థితి, ముంపుకు గురయ్యే ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వరద సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రతీ ఏటా గోదావరికి వరదలు వస్తున్నాయని, ఈ వరదల వల్ల పరివాహక ప్రాంతం అతలాకుతలం అవుతోందన్నారు. గత ప్రభుత్వం ఇక్కడి పర్యటించిన వారు గోదావరి సమయంలో అనేక తప్పిదాలు చేశారని, ప్రజలకు ఎన్నో మాటలు చెప్పారని అన్నారు. ఈ ప్రభుత్వం గత పాలకుల తప్పిదాలు పునరావృతం కాకుండా చూస్తుందని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలంపై ప్రత్యేక దృష్టి సారించి పరిస్థితిని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. ఎంతటి వరద వచ్చినప్పటికీ దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు గోదావరి వరదల పట్ల జాగురతో ఉండాలని. వరదనీరు ప్రవేశించే ప్రాంతాల్లోని ప్రజలను ముందస్తుగానే పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాటు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితి ఎలాంటి చిన్న ఇబ్బంది కూడా జరగరాదని, పునరావాస కేంద్రాల్లో ఉండే ప్రజ పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ నాణ్యమైన భోజనాలు అందించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా విద్యుత్ సరఫరా లైన్లు ఇప్పటి నుండే చూసుకోవాలని, అసలే వర్షాకాలం కరెంటు లేక పోతు ఇబ్బందులు ఎదురవుతాయని సూచిచారు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని వరద సమాచార కేంద్రానికి చేరవేయాలని ఉధృతిని బట్టి సంసిద్ధం చేయాలన్నారు.గోదావరి తీరంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మర పడవలతో పాటు గజీతగాళ్లను, లైఫ్ జాకెట్లను సిద్ధం చేసుకోవాలని, ఎన్‌డిఆర్ఎఫ్, డిడిఆర్ఎఫ బృంధాలు సిద్ధంగా ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటూ నది పరివాహక ప్రాంతాల్లో పర్యాటకుల రాకను తగ్గించేందుకు ఏర్పాట్లు చేయాలని,



గోదావరి తీరం వెంట ఎప్పటికప్పుడు గస్తీకాస్తుండాలని సూచించారు. వర్షాలతో పాటు వరదలు ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అంటు వ్యాధులు ప్రభలే అవకాశం ఉండటంతో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ అన్ని రకాల మందులను సిద్ధం చేసుకోవాలని, అస్పత్రిలో ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేయాలని, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలను స్వీయ పారిశుధ్య దిశగా చైతన్య పరచాలన్నారు. వరదల వల్ల రహదార్లు మూసుకుపోయే ప్రాంతాలను గుర్తించి ప్రమాదబోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి చెప్పారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. దైవదర్శానికి వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించరాదని, వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని మెలగాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రంగా సిద్ధంగా ఉండాలని, ప్రజలు కూడా అధికారులకు సహరిస్తూ పునరావాస కేంద్రాలుకు వెళ్లాలని చెప్పారు. మంగళవారం ఉదయం నాటికి గోదావరి వరద మూడోప్రమాద హెచ్చరిక స్థాయి 53 అడుగులు దాటి 54 అడుగుల వరకు ప్రవహించే అవకాశం ఉందని, అంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్. ఐటిడిఏ పిఓ బి.రాహుల్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలి

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని రేషన్ డీలర్లు సమయ పాలన పాటిస్తూ లబ్దిదారులకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాకలెక్టర్ ఆదేశానుసారం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లాలోని చౌక ధరల దుకాణ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ డీలర్లంతా సమయ పాలన పాటించి లబ్దిదారులకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. రేషన్ డీలర్లు తమ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లో ప్రతి రోజు రోజు వారి స్టాక్ వివరాలను అప్‌డేట్ చేయాలని తెలిపారు. ప్రతి డీలర్ ఎంఎల్ఎస్ పాయింట్ నందు కాటా సరి చూసుకోని సరైన తూకంతో రేషన్ బియ్యాన్ని లోడు చేసుకోవాలని సూచించారు. చౌక దుకాణాల్లో ఉండాల్సిన దాని కన్న రేషన్ బియ్యం హెచ్చుతగ్గులు ఉన్నచో అట్టి డీలర్లపై 6ఎ కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిడిఎస్ బియ్యం కొనుగోలు చట్టవిరుద్ధం కావున వాటిని కొనుగోలు చేసిన వారి వివరాలు తెలియపర్చాలన్నారు. కార్డులో సదరు సభ్యుడు మరణించిన యెడల అట్టి జాబితాను ప్రతి నెల మండల తహసీల్దార్లకు నివేదిక సమర్పించాలన్నారు. పోర్టబిలిటి అలాట్‌మెంట్‌ను డీలర్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీలర్ల వద్ద సీజ్డ్ స్టాక్ ఉంటే వాటిని ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు అప్పగించాలన్నారు. కార్డుదారుల ఈకెవైసి నమోదును 100 శాతం పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, అధికారులు, సిబ్బంది, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎంఎల్‌సి తాతా మధుసూదన్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్ సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 54 మంది లబ్దిదారులకు రూ. 16.25 లక్షల చెక్కులను ఎంఎల్‌సి తాతా మధుసూదన్ పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూత నందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం విడుదల చేసిన చెక్కులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణు, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు వీరన్న, మైనార్టీ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, పోట్ల శ్రీను, ముత్యాల వెంకటప్పారావు, పగడాల నరేందర్, ఉమాశంకర్, సతీష్, ధనుంజయ్, విజయ్, సద్దాం, ఫిరోజ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నబీరవల్లిలో హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని చిన్నబీరవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం నందు సోమవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ వచ్చిన రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో జ్వరాలు ఉన్న కారణంగా ఈ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. అలాగే గ్రామంలో ఫాగింగ్, శానిటేషన్ జరిపించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఓ, మండల వైద్యాధికారి, ఇతర ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# పలువురికి నివాళులర్పించిన జెడ్పి చైర్మన్



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు సోమవారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన చిన్నారి బోయినపల్లి రిషిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన జొన్నలగడ్డ కోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రావినూతల గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ బోయినపల్లి కొండలు పెద్ద కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు సానుకూల దృక్పథంతో మెలగాలి



**ప్రజాపక్షం/ చింతకాని :** విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మార్పులు గమనిస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని శిక్షణ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట పేర్కొన్నారు. చింతకాని మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఎంపిడిఓ, ఎంపిఓ విధులపై ఆరా తీశారు. అనంతరం లచ్చగూడెం అమ్మ ఆదర్శ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థుల ప్రతిభను ఆయన పరిశీలించారు. ఇంగ్లీష్, గణితం, జీవశాస్త్రం సబ్జెక్టుల్లో పలు అంశాలపై ఆయన విద్యార్థులను ప్రశ్నించి వారిని అభినందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి కేంద్రానికి వచ్చిన గర్భిణీలు, బాలింతలతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపిఓ మల్లెల రవీంద్రప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్ ఉన్నారు.

# రేపు ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**ప్రజాపక్షం/దమ్మపేట:** ఈ నెల 24న ఎంఆర్‌పిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం కొత్తగూడెం అంబేద్కర్ భవనంలో జరగనుందని ఎంఆర్‌పిఎస్ తెలంగాణ స్టేట్ సెక్రటరీ కొలికపోగు కాంతారావు మాదిగ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సమావేశానికి అన్ని మండలాల నుంచి ఎంఆర్‌పిఎస్ బాధ్యులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ముసలయ్య, అశోక్, రావూరి వీరయ్య, రాయల పుల్లారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి

**ప్రజాపక్షం/వైరా:** గత ఐదు రోజుల నుండి విపరీతమైన వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తూ ఉండటంతో గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల కారణంగా బోరుల్లోకి బావుల్లోకి చెరువుల్లోకి కొత్తనీరు ప్రవేశం వస్తుంది. ఆ నీరును త్రాగునీటికి పంపుల ద్వారా నల్లాల ద్వారా మంచినీటికి వాడుతారు. నీరు తాకడం వలన రకరకాల జబ్బులు జ్వరం ఒళ్ళు నొప్పులు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ జ్వరాలు వచ్చే సూచనలు ఉన్నందున ప్రతి పల్లెలోను ప్రతి పట్టణంలోను హెల్త్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని వైరా మండల సిపిఐ కార్యదర్శి యామాల గోపాలరావు అన్నారు.

# బురదయమంగా మారిన రోడ్డు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సోమవారం ఎర్రబోడు గ్రామంలో అధిక వర్షాలతో సిసి రోడ్డు మీద నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిత్తారి రామకృష్ణ ఇంది నుండి పూనమ్ భద్రయ్య ఇంటివరకు సిసి రోడ్డు మీద నీళ్ళు మట్టి బురద ఉండటంతో ఎత్తిపోయడం జరిగింది. శ్రమదానం కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, వెంకటేష్, సుధాకర్, సాంబయ్య, అశోక్ పాల్గొన్నారు.

# సహాయక చర్యల్లో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలి

**- పునరావాస కేంద్రాలకు పార్టీ కార్యాలయాలు సిద్ధం చేయాలి**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** భారీ వర్షాలు వరద కారణంగా గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని పార్టీ శ్రేణులు, రెడ్‌షర్ట్ వాలంటీర్లకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో ఆయన మాట్లాడుతూ గోదావరి నది రెండో ప్రమాదహెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తోందని, ఇప్పటికే చాలా ఏజెన్సీ గ్రామాలు వరద భయంలో ఉన్నాయని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా ఉండాలని, ప్రభుత్వాధికారులను సంప్రదించి వారితో పాటు సహాయకచర్యల్లో పాల్పంచుకోవాలని కోరారు. అధికార యంత్రంగా స్పందిస్తున్న తీరు హర్షణీయమని, వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు సేవలు ఇదేరీతిలో కొనసాగించాలన్నారు. నిర్వాసితుల సంఖ్యకు అనుగుణంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల, పట్టణ, గ్రామ స్థాయి పార్టీ కార్యాలయాలను పునరావాస కేంద్రాల కోసం సిద్ధం చేసి అధికారులకు సమాచారం అందించాలని, బస,భోజన వసతి సౌకర్యాలకు కావాల్సిన వనరులను సమకూర్చుకుని సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య శాఖకు సమాచారం అందించి ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించాలని, పారిశుధ్యం మెరుగు పరిచేందుకు గ్రామపంచాయితీ, మున్సిపాలిటీలను అప్రమత్తం చేయాలని కోరారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు, కార్యకర్తలు, అధికారులు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామంలోగల ఆయన స్వగృహంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు మంత్రిని కలిసి కొన్ని సమస్యలను విన్నవించారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో విద్యుత్, ధరణి, వైద్య తదితర సమస్యలు పై మంత్రి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాలను సమర్పించారు. తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి దరఖాస్తులను అందించారు. అనంతరం అంకిరెడ్డి రామ నరసమ్మ, చెన్నారావులు గతంలో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్ర, ఏసిపి రఘు, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, విద్యుత్ డిఈ రాములు, ఏడి యాదగిరి, స్థానిక నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి లతోపాటు పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికవర్గానికి దిక్సూచి ఏఐటియుసి

**-కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి**
**-గుర్తింపు సంఘం నియామక పత్రం వెంటనే ఇవ్వాలి**
**-వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ నేతలు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో ఏఐటియుసి ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ బొగ్గు గనుల వేలం పాటను వ్యతిరేకిస్తూ నాటి నైజాం సర్కార్‌లో తీసుకొచ్చిన చట్టాన్ని అమలు చేస్తూ గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గును సింగరేణి సంస్థకే అప్పగించాలన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఆరు నెలలు కావస్తున్న సింగరేణి యాజమాన్యం ఇప్పనటివరకు గుర్తింపు నియామక పత్రం ఇవ్వకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కంపెనీలో దందాలు చేస్తూ అనేక రకాల కార్యకలాపాలు చేస్తున్న వారిపై ఎటువంటి విజిలెన్స్ చర్యలు చేపట్టడం లేదు ఎందుకని అన్నారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సినటువంటి ప్రమోషన్లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. సింగరేనిలో సరిపడా సూపర్‌వైజర్ స్టాఫ్ లేనందున కార్మికులపై భారం పడుతుందని దీనివలన అనేక రకాల మైనింగ్ యాక్సిడెంట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని సంస్థ ఆఫీస్ నందు జరిగిన సేఫ్టీ పార్టీ మీటింగ్‌లో డిజిఎంఎస్ సైతం సూపర్‌వైజర్ల భర్తీకి అంగీకరించిందని తెలిపారు. సంస్థ నందు పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన జీతాలు నిర్ణీత సమయంలో కాంట్రాక్టుల వద్ద నుండి సంస్థ ఇప్పించాలని సింగరేణిలో పనిచేస్తున్న కన్వెన్షన్ డ్రైవర్ల వద్ద నుండి 12% మినహాయించాల్సిన పిఎఫ్‌ను 24%గా మినహాయిస్తున్నారని, దీనిపై యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు రావాల్సినటువంటి లాభాల వాటాను వెంటనే సంస్థ ప్రకటించాలని, సంస్థ లాభాల్లో నుండి కార్మికులకు 35% లాభాల వాటాను ఇవ్వాలన్నారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు కార్పొరేట్ వైద్య యాజమాన్యం కార్మికుల వద్ద నుండి డబ్బు తీసుకొని వైద్యం చేస్తున్నారని, ఇటువంటి వైద్యశాలపై సంస్థ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి గనిగల వీరస్వామి,కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, నాయకులు జక్కుల గట్టయ్య, కె.రాములు, కిష్టాఫర్, సముద్రాల శ్రీను, సుధాకర్, రాము, సందెబోయిన శ్రీనివాస్, సావటి స్వామి, ఉర్సు శివ దర్శన్, బండారు మల్లయ్య, అనిల్, సురేందర్, బొట్ల లక్ష్మణ్, వసంత మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బ్యాంకుల వద్ద బారులు తీరిన రైతులు



**ప్రజాపక్షం/కారేపల్లిః** కారేపల్లి, మాదారంలోని ఎస్‌బిఐ, ఏపిజివిబి, డిసిసిబి, సహకార సంఘ బ్యాంకుల్లో సోమవారం రుణమాఫి సందడి మొదలైంది. రుణమాఫికి వచ్చిన రైతుల పేర్లు బ్యాంకుల గోడలకు అతికించారు. దీంతో రైతులు తమ పేర్లు చూసుకునేందుకు బారులు తీరారు. అనంతరం లబ్దిదారులు పట్టాదార్‌పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను బ్యాంకర్లకు అందజేశారు.

# కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు అధిక శాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వరక అజిత్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ఈ ఏడాది బడ్జెట్లో కేంద్రం 10శాతం, రాష్ట్రం 30శాతం నిధులు కేటాయించాలని, తద్వారా దేశంలో రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పరిరక్షణకు, ప్రభుత్వ విద్యా బలోపేతం చేసే విధంగా నిధుల కేటాయింపులు ఉండాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో గాని విద్యా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నటువంటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్య హక్కులను సాధించుకునే విధంగా విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు.

# సమయపాలన పాటించని ఉపాధ్యాయులు..!

**ఇన్సూరెన్స్, వడ్డీ,రియల్ వ్యాపారంలో పలువురు ఉపాధ్యాయులు**



**ప్రజాపక్షం/వైరాః** విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పలువురు పాఠశాలలో సమయపాలన పాటించడంలేదు. ప్రభుత్వపాఠశాలల్లోను, గురుకుల పాఠశాలల్లోను సమయపాలన పాటించకుండా ఉదయం పాఠశాలలో జరిగే పేరుకు అసెంబ్లీకి చాలా మంది ఉపాధ్యాయులు హాజరు కావడం లేదు. అంటే ఉపాధ్యాయులకు సమయపాలన పాటించడంలో ఎంత బాధ్యత ఉందో అర్ధమవుతుంది. కొందరు ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా విధి నిర్వహణలో పాల్గొంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. కొన్ని పాఠశాలల్లో ఒకరి రాక ఆలస్యమైతే మరొకరు చూడడం అలా ఒకరికొకరు పాఠశాలలో విధులునిర్వహణలో ఆలస్యంగా రావడం కాని విధులకు రాకపోవడంలో గాని తోడ్పాటు అందించుకుంటున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలకు రావద్దు అనుకుంటే ముందుగానే సెలవుకు సంబంధించిన లెటర్‌ను డేట్ లేకుండాపాఠశాలలో ఇచ్చేస్తారు. ఎవరైనా పాఠశాల తనిఖీకి వస్తున్నారు అంటే అప్పుడే లెటర్‌పై డేట్ చేసి సెలవు పెట్టారు అని చెబుతారు. అసలు ఉపాధ్యాయులు ఉదయం ఎన్ని గంటలకు పాఠశాలకు రావాలి. రిజిస్టర్‌లో వచ్చిన సమయంతో పాటు సంతకం చేయాలి. అలా సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపార రంగంలో ప్రత్యేక ముద్ర వారధి.జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు విద్యాబుద్దులు నేర్పాల్సిన వారే అధిక సంపాదన ధ్యేయంగా పాఠశాలలో విద్యాబుద్దుల కంటే ఇతర వ్యాపార రంగాలపైన ఎక్కువ దృష్టి సాధిస్తున్నారు. కొంతమంది ఫైనాన్స్ వ్యాపారం ఇన్సూరెన్స్,గిరిగిరి, వడ్డీ వ్యాపారం, రియల్ ఎస్టేట్ వ్యాపారం లాంటి వ్యాపారాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. గతంలో కూడా ఇలాంటి ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలకు సెలవు పెట్టకుండానే వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలులేకపోలేదు.ఏది ఏమైనప్పటికీ విద్యాబుద్దులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యచెప్పే దాని కంటే అధిక సంపాదన ధ్యేయంగా వ్యాపారాలపై దృష్టి పెట్టి విద్యార్థుల విద్య చెప్పడంపై ఆసక్తి చూపడం అనేది అర్ధమవుతుంది. ఇప్పటికైనా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుడు సమయపాలన పాటించే విధంగా చర్యలు చేపట్టిపాఠశాలలో జరిగే అసెంబ్లీలో అందరూ పాల్గొనేటట్లు చూడాలని కోరుకుంటున్నారు.

# సిబ్బంది కోసం డైనింగ్ హాల్ ఏర్పాటు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విధి నిర్వహణ సమయంలో సిబ్బంది భోజనం చేయడానికి వీలుగా డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్టిసి ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. విధి నిర్వహణ సమయంలో భోజనం చేయడానికి కండక్టర్లు, డ్రైవర్లు , సిబ్బంది ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఖమ్మం పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్‌ను ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ పాత బస్టాండ్ పునః ప్రారంభమైన తర్వాత రెండేళ్లుగా భోజనం చేయడానికి సరైన సౌకర్యాలు లేక సిబ్బంది బస్సుల్లో కూర్చుని భోజనం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిబ్బంది ఇబ్బందుల దృష్ట్యా అన్ని సదుపాయాలతో డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కండక్టర్ల చేతుల మీదుగా రిబ్బన్ కత్తిరించారు. భోజనశాలను ప్రారంభించినందుకు రీజినల్ మేనేజర్‌కు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దినేష్‌కుమార్, సూపర్ వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** వర్షాకాలం కారణంగా మారుమూల ప్రాంతాల్లో వాగులు వంకలు పొంగిపొర్లు తున్నాయని, గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తోందని, ఆయా పాఠశాలలు. ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికాడేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యలపై వచ్చిన గిరిజనుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపిఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే గిరిజనుల నమ్మకాన్ని ఒమ్ముచేయరాదని, సంబంధిత అధికారులు ప్రతి దరఖాస్తును పూర్తిగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని చెప్పారు. పరిష్కరించేందుకు వీలుకాని వాటిపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు కాలం కాబట్టి ప్రతీ ఒక్కరూ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇబ్బందులు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

# సూర్యతండా పాఠశాలలో శిక్ష సప్త శిక్షణా కార్యక్రమం

**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలం ప్రభుత్వ పాఠశాల ప్రాథమిక ఉన్నత పాఠశాల సూర్యతండా నందు శిక్షాసప్త శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు గణితంలో ముందు సంఖ్య తర్వాతి సంఖ్య ఇంగ్లీషులో చాయిస్ పదాలు తెలుగు నందు వర్ణమాలలు ఎలా గుర్తించాలో ఉపాధ్యాయులు క్షుణ్ణంగా వివరణాత్మకంగా విద్యార్థులకు నేర్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సావిత్రి, ఉపాధ్యాయులు జరపల హర్జ్య, సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.